సాక్షి ప్రకాశం

బుధవారం । 20 । ఆగస్టు । 2025



డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ఆమోదించాలి

డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను ఆమోదించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు.

- 8లో..



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన కనిగిరి మండలంలో జరిగింది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 30 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి



రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఒంగోలు సిటీ: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం ఒంగోలులోని మెడికల్ కాలేజీలో ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి ఒంగోలు పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాస రావు తాలూకా అధ్యక్షుడు సురేష్ బాబు, ప్రసన్న, ఏసురత్నం, శ్రీనివాసులు ,అంకబాబు లతోపాటు మెడికల్ కళాశాల ఉద్యోగులు విజయ లక్ష్మీ గారు, శ్రీనివాస యాదవ్, బాబురావు ,రాజేష్, కార్తీక్, దినకర్, ప్రభావతి, చాందిని ,రమేష్ బాబు, లావణ్య, పద్మలత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంగోలు కళా ఉత్సవాలు ప్రారంభం

ఒంగోలు టౌన్: సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నగరంలోని సీపీఎస్ రీడింగ్ రూంలో బుధవారం నుంచి కళా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్ తెలిపారు. మంగళవారం పీవీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో కళా ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్షుడు మనోహర్ నాయుడు, ప్రజానాట్యమండలి కార్యదర్శి చిన్నం పెంచలయ్యతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం చంద్రా నాయక్ మాట్లాడుతూ...ఈ నెల 24వ తేదీ వరకు కళా ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. నేటి సమాజం ఎదుర్కొంటున్న అనేక ప్రజా సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని కళారూపాలుగా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ కళా ఉత్సవాలలో ప్రముఖ సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, బాబ్జీ, సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, గోరటి వెంకన్న, జయరాజ్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

సర్వజన ఆస్పత్రికి వచ్చిన వారికి వ్యాధుల బాధల కన్నా ఆస్పత్రిలోని సమస్యలతో అవస్థలు పడుతున్నారు. ఓపీ దగ్గర నుంచే రోగులకు కష్టాలు ప్రారంభమవుతున్నాయి. గంటలకొద్దీ క్యూలో ఉండి ఓపీ తెచ్చుకున్నా నాడి పట్టేందుకు పెద్ద డాక్టరుఉండరు. హౌస్ సర్జన్లు, జూనియర్ డాక్టర్లే దిక్కు. హాజరు వేసుకుని వెళ్లిపోయే పెద్ద డాక్టర్లు సెల్‌ఫోన్‌లోనే వైద్యం చేస్తున్నారు. ఇక అత్యవసర కేసులైతే వారి ప్రాణాలు దైవాధీనమే. నడవలేని రోగులకు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేక రోగులు, వారి బంధువుల అవస్థలు వర్ణనాతీతం.



రిమ్స్‌లో ఓపీ కోసం బారులు తీరిన జనం (ఫైల్)

సర్వజన అవస్థలు..

ప్రాణాలు దైవాధీనం!

- ఓపీ కోసం గంటలకొద్దీ నిరీక్షణ
- వీల్ చైర్లు, స్ట్రెచర్లులేక రోగుల ఇక్కట్లు
- పేరుకు మూడు లిఫ్టులున్నా మెట్లెక్కక తప్పని పరిస్థితి
- హౌస్ సర్జన్లతోనే పనికానిస్తున్న అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- చికిత్సంటే భయపడిపోతున్న సామాన్యులు
- అడుగడుగునా రాజకీయాలు



రోగిని వీల్‌చైర్‌లో తోసుకెళ్తున్న కుటుంబ సభ్యురాలు

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలులోని సర్వజన ఆస్పత్రి రోగుల సహనాన్ని పరీక్షిస్తోంది. పేరుకు పెద్దాస్పత్రి అయినా ఇక్కడ చికిత్స తీసుకోవాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిందే. ఓపీ దగ్గర నుంచి వైద్యం చేయించుకునే వరకూ పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. అష్టకష్టాలుపడి ఓపీ తీసుకుని సంబంధిత డాక్టర్ గది దగ్గరకు వెళితే సీనియర్ వైద్యులు అందుబాటులో ఉండరు. మెడలో స్టెత్ వేసుకొని తిరుగుతున్న జూనియర్ వైద్యులతోనే పనికానిస్తుండడంతో రోగులు అసంతృప్తికి గురవుతున్నారు. మంచి డాక్టర్లు ఉన్నారంట అని చెప్పుకుంటుంటే విని ఎంతో దూరం నుంచి వచ్చిన రోగులకు పెద్ద డాక్టర్ల దర్శనభాగ్యం ఉండదు. అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఎవరి వీల్ చైర్లు వారే తెచ్చుకోవాల్సిన దుస్థితి. ఆస్పత్రి బయట అత్యవసర రోగుల కోసం స్ట్రెచర్లు ఉండవు. వీల్ చైర్లు ఉండవు. ఒకవేళ ఉన్నా రోగులను లోపలకు తీసుకెళ్లేందుకు సిబ్బంది ఉండరు. రోగుల సహాయకులే వీల్ చైర్లను తోసుకుంటూ వెళ్లాల్సి పరిస్థితులు నెలకొన్నాయి.

వేయి మందికి 16 కుర్చీలు

సర్వజన ఆస్పత్రికి ప్రతి రోజు 800 మంది నుంచి 1000 మందికి పైగా రోగులు వస్తుంటారు. సోమవారం, బుధవారం, శనివారం రోజుల్లో ఈ సంఖ్య 1200 లకు పైగానే ఉంటుంది. మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి, టంగుటూరు, సింగరాయకొండ ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న యర్రగొండపాలెం, దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, కంభం, దొనకొండ, కురిచేడు ప్రాంతాల నుంచి కూడా చికిత్స కోసం రోగులు ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడకు వచ్చిన రోగులు మొదట అభా యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ఓటీపీ వచ్చాక ఓపీ కౌంటర్ దగ్గరకు వెళ్లాలి. ఈ ప్రక్రియ పూర్తవడానికి కనీసం గంటన్నరకు పైగానే పడుతుంది. అంతసేపు రోగులు ఎదురు చూస్తూ నిల్చోవాలి. ఇక్కడ వందల మంది రోగులకు కేవలం 16 కుర్చీలు, 6 బల్లలు మాత్రమే ఉన్నాయి. ఒక్కో బల్లమీద నలుగురు కూర్చోవచ్చు. అంటే మొత్తం మీద 40 మంది మాత్రమే కూర్చునే అవకాశం ఉంది. మిగిలిన వారంతా గంటల తరబడి నిలబడలేక నానా అవస్థలు పడుతున్నారు. అయినా జీజీహెచ్ అధికారులు పట్టించుకోవడంలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్స కోసం వచ్చే రోగులు మౌలిక వసతులు లేక అల్లాడిపోతున్నారు.

పారిశుధ్యం అధ్వానం

జీజీహెచ్‌లో పారిశుధ్యం లోపించింది. ఆస్పత్రిలోని మూడు అంతస్తుల్లో ఎక్కడా ఫినాయిల్‌తో శుభ్రం చేసినట్లు కనిపించదు. బాత్ రూంలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా దుర్గంధం వెదజల్లుతుంటాయి. కంట్రాక్టర్ ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడిన అధికారులు నాసిరకం ఫినాయిల్ వినియోగిస్తూ నెలనెలా లక్షల్లో బిల్లులు డ్రా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు బ్లీచింగ్ ఎక్కడ చల్లుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఆస్పత్రిలో దోమల బెడద ఎక్కువైపోయిందని, ఆరోగ్యం కోసం ఆస్పత్రికి వస్తే అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఆస్పత్రికి గాయాలతో వచ్చే రోగులు చాలా ఎక్కువ. గాయాలను శుభ్రం చేసే గాజుగుడ్డ మరీ నాసిరకంగా ఉంటుందని, బెటాడిన్, హైడ్రోజన్ పెరాక్సైడ్, స్పిరిట్‌లు మరీ నాణ్యతలేనివి వాడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. రోగుల ఆరోగ్యం కంటే తమ చేతికి వచ్చే కమీషన్ల మీదనే అధికారులు దృష్టి పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అడుగడుగునా రాజకీయమే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీజీహెచ్‌లో అడుగడుగునా రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. కొంత మంది వైద్యులు, సిబ్బంది అధికార పార్టీకి చెందిన వారమంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రాణాలు కాపాడాల్సిన ఆస్పత్రిలో రాజకీయాలేంటని రోగులు విమర్శిస్తున్నారు.

సెల్‌ఫోన్ వైద్యం..

ఎక్కడైనా ప్రైవేటు వైద్యశాలలో అసలు వైద్యుడు లేకుండా మరో వైద్యుడితో చికిత్స చేయించడం నేరమని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతుంటారు. కానీ సాక్షాత్తూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే అలాంటి పరిస్థితి నెలకొంటే అధికారులు ఏమని సమాధానం చెబుతారో.. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో మెడికల్, ఆప్తమాలజీ, డెంటల్, పీడియాట్రిక్, గైనిక్, న్యూరో, సర్జికల్, సైకాలజీ, పల్మనాలజీ, ఆర్థో, అంకాలజీ, రేడియాలజీ, చర్మవ్యాధులకు సంబంధించిన విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి ఒక హెచ్‌ఓడీ ఉన్నారు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదుల సంఖ్యలో విధులు నిర్వహిస్తున్నారు. పేరుకు చాంతాడమంత మంది పనిచేస్తున్నా ఒక్కరు కూడా రోగులకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాజువాలిటీలో ఆయా విభాగాలకు చెందిన వైద్యులు కంటే హౌస్ సర్జన్లు, జూనియర్ వైద్యులే కనిపిస్తుంటారు. వారి ద్వారా రిపోర్టులు తెప్పించుకుంటూ మొబైల్ వైద్య సేవలందిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కీలకమైన ఐసీయూల్లో వెంటిలేటర్ల మీద ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులకూ సెల్‌ఫోన్‌లో చెప్పే వైద్యమే సాగుతోందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. చాలామంది వైద్యులు నగరంలోని ప్రైవేటు వైద్యశాలల్లో పనిచేస్తున్నారని, కొందరు సొంతంగా క్లినిక్‌లు నిర్వహిస్తూ విధులకు దుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్క లిఫ్టుతో అవస్థలు..



పనిచేయని లిఫ్ట్

జీజీహెచ్‌లో పేరుకే మూడు లిఫ్టులు. ఓపీ కౌంటర్ల వద్ద ఉన్న ప్రధానమైన లిఫ్టు ఏడాదిగా పనిచేయడం లేదు. డయాలసిస్ సెంటర్ వద్ద ఉన్న లిఫ్టు నెల రోజులుగా మరమ్మతులకు గురైంది. ఇక మిగిలింది మెడికల్ ఓపీ దగ్గర ఉన్న లిఫ్టు మాత్రమే పనిచేస్తుంది. దాంతో ఎప్పుడు చూసినా ఈ లిఫ్టు దగ్గర రోగులు గుంపులు గుంపులుగా నిలబడి ఉంటున్నారు. ఒకేసారి 15 మందికి పైగా లిఫ్టు ఎక్కుతుండడంతో మధ్యలోనే ఎక్కడ ఆగిపోతుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. లోడు ఎక్కువ కావడంతో ఇది కూడా దాదాపుగా చెడిపోయే పరిస్థితికి చేరుకున్నట్లు ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. గుండె జబ్బుల విభాగం మొదటి అంతస్తులోనే ఉంది. గుండె జబ్బులతో బాధపడే రోగులు లిఫ్టు ఎక్కే పరిస్థితి లేకపోవడంతో మెట్లు ఎక్కాల్సి వస్తోంది. దీంతో కొందరు రోగులు వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారు. ఆస్పత్రి రెండు, మూడు అంతస్తుల్లో ఎంఐసీయూ, ఆర్ఐసీయూ, ఎస్ఐసీయూ, పీడీఐసీయూ, సర్జికల్ ఐసీయూలు ఉన్నాయి. మొత్తం మీద ఈ ఐసీయూల్లో 100 మందికి పైగా చికిత్స చేయించుకుంటున్నారు. అయినా అధికారులకు చీమకుట్టినట్టయినా లేదని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి లిఫ్టులు పనిచేయకపోయినా అధికారులు పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మృత్యువులోనూ వీడని స్నేహం..

- పునుగోడు రిజర్వాయర్ చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి
- ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి మంగళవారం శవాలుగా తేలిన వైనం
- యువకుల మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు
- మృతుల సెల్‌ఫోన్ లొకేషన్లపై అనుమానం



మృతుడు శివ ప్రసాద్(ఫైల్)



మృతుడు గౌతమ్ (ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు



రోదిస్తున్న గౌతమ్ తల్లి బంధువులు

కనిగిరిరూరల్: ఒకరు సీనియర్, మరొకరు జూనియర్ అయినా వారిద్దరూ మంచి స్నేహితులు.. సరదాగా చెరువులో తెప్పపై వెళ్లిన ఇద్దరూ తెప్ప తిరగబడి నీటమునిగి ఒకేసారి మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి పట్టణంలోని నక్కలతిప్పకు చెందిన బొందలపాటి ప్రవీణ్ కుమారుడు బొందలపాటి శివ ప్రసాద్ (19), శంఖవరంలోని ఏనుగంటి ఎర్రయ్య కుమారుడు ఏనుగంటి గౌతమ్ (18) ఇద్దరూ ఇంటర్మీడియెట్‌లో జూనియర్, సీనియర్‌లు. వీరిద్దరూ స్నేహితులు. గౌతమ్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతుండగా.. శివ ప్రసాద్ ఇంటర్ పూర్తయి సబ్జక్టులు మిగిలి ఉండటంతో ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఓ ప్రైవేటు టీచర్ దగ్గర ట్యూషన్‌కు వెళ్లిన గౌతమ్ రాత్రికి అక్కడే ఉన్నాడు. ఆదివారం ఉదయాన్నే ఆ ప్రైవేట్ ట్యూషన్ టీచర్ వద్ద బైక్ తీసుకుని శంఖవరంలోని ఇంటి దాకా వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. భైరవకోన జలపాతం చూసేందుకు వెళ్తున్నానని ఇంటిదగ్గర చెప్పి బయటికి వచ్చాడు. అనంతరం నక్కలతిప్ప వద్ద స్నేహితుడు శివప్రసాద్ ఇంటి వద్దకు వెళ్లి అతడిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. అయితే వీరిద్దరూ పునుగోడు వద్ద రిజర్వాయర్ చెరువు వద్దకు వెళ్లారు. అక్కడున్న తెప్ప పడవను తీసుకుని సరదాగా లోపలికి వెళ్లారు. తెప్పను లోపల అదుపు చేసుకోలేకపోవడంతో అది తిరగబడింది. దీంతో వీరికి ఈత రాక ఇద్దరూ రిజర్వాయర్ నీటిలో మునిగి మృతి చెందారు. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ఇద్దరు పిల్లలు ఇంటికి తిరిగిరాకపోవడంతో మృతుల తల్లిదండ్రులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం పునుగోడు రిజర్వాయర్ వద్దకు వచ్చిన జాలర్లకు కట్ట దగ్గర తెప్ప కనపడకపోవడంతో మరో తెప్ప సాయంతో లోపలికి వెళ్లి చూడగా ఒక తెప్ప, యువకుల మృతదేహాలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై టీ శ్రీరాం ఘటనా స్థలానికి సిబ్బందితో వెళ్లి యువకుల మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఇతర అధికారులు పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. చనిపోయిన యువకులిద్దరివీ నిరుపేద కుటుంబాలే. ఆ ఇళ్లకు వారిద్దరూ పెద్ద కుమారులే.

అనుమానం వ్యక్తం చేస్తున్న మృతుల తల్లిదండ్రులు: రెండ్రోజుల నుంచి ఇద్దరు పిల్లల్లో ఒకరి ఫోన్ పూర్తిగా స్విచ్ ఆఫ్ కావడం.. మరొక ఫోన్‌రింగ్ అయినా లిఫ్ట్ చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల మృతదేహాలపై గాయాలు కూడా ఉన్నాయంటున్నారు. ఫోన్ లొకేషన్లపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఫోన్ లొకేషన్లు కొంత సేపు సీఎస్‌పురం ప్రాంతంలో, కొద్దిసేపు కనిగిరి ప్రాంతంలో, మరికొంత సేపు మంత్రాలయం ఏరియాలో ఉన్నట్లు శివప్రసాద్ తండ్రి ప్రవీణ్ ఆరోపిస్తున్నాడు. తన కుమారుడి ఒంటిపై గాయాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.

ఎస్సై శ్రీరాం ఏమంటున్నారంటే..

ఈ సందర్భంగా ఎస్సై టీ శ్రీరాం విలేకరులతో మాట్లాడుతూ భైరవకోన జలపాతం చూసేందుకు వెళ్తున్నట్లు చెప్పిన ఇద్దరు యువకులు పునుగోడు రిజర్వాయర్ వద్దకు వెళ్లారని..తెప్ప పడవ తీసుకుని రిజర్వాయర్‌లోకి దిగి తెప్ప బోల్తాపడటంతో నీటిలో మునిగి ఈతరాక మృతిచెందారన్నారు. మృతదేహాలను పరిశీలించగా ఎటువంటి గాయాలు లేవని, అయినా పోస్టుమార్టం నిర్వహించి ఎఫ్ఎస్ఎల్ (చనిపోయాక నీళ్లలో పడేశారా.. లేక నీళ్లలో పడిన తర్వాత చనిపోయారా అనేది నిర్ధారించే పరీక్ష) రిపోర్టు ప్రకారం తగు దర్యాప్తు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సోమవారం పునుగోడు రిజర్వాయర్‌ను చూసేందుకు సీఎస్‌పురం మండలం సీతారాంపురానికి చెందిన కొందరు ముస్లిం కుటుంబాలు వచ్చాయన్నారు. వాళ్లకు మృతులకు సంబంధించిన ఫోన్లు దొరికాయని.. వాటిని సీఎస్‌పురం ఎస్సైకు అందజేశారన్నారు. అయితే మృతుల ఫోన్ నంబర్లు, ముస్లిం కుటుంబాల సెల్‌ఫోన్ నంబర్లు కూడా సీడీఆర్‌లో పెట్టి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బయటకు వద్దన్నా వినలేదు..

ఇంట్లో మీనాన్న లేరు.. నువ్వు బయటకు వెళ్లొద్దు.. నాన్న వస్తే అరుస్తాడు అని ఎంత బతిమిలాడినా.. వినకుండా ఆదివారం కదా.. ఒక అరగంట ఊర్లోనే అలా బయట తిరిగి వస్తాను.. అని చెప్పి వెళ్లిన మనవడు శవంగా మారాడని మృతుడు బొందలపాటి శివ ప్రసాద్ నాయనమ్మ కన్నీరుమున్నీరైంది. చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు దుర్గ, ప్రవీణ్‌లు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తండ్రి ప్రవీణ్ స్టేజీ కళాకారుడు.. కార్యక్రమాల్లో పాటలు పాడి వచ్చిన డబ్బుతో పిల్లలను పోషించుకుంటున్నాడు. ఇద్దరు కుమారులు కాగా శివ ప్రసాద్ పెద్ద కుమారుడు.

ఇప్పుడే వస్తానని వెళ్లి..

వెంటనే తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు.. శవమై తేలడంతో తల్లిదండ్రులు అంకమ్మ, ఎర్రయ్యలు చేసే రోదనలు మిన్నంటుతున్నాయి. కూలీ పనిచేసుకుని జీవించే ఆ కుటుంబంలో చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. గౌతమ్ చదువులో కూడా మంచి తెలివి గల వాడని బంధువులు తెలిపారు. పేదరికం కారణంతో ప్రైవేటు కళాశాల నుంచి ఇంటర్ రెండో సంవత్సరం ప్రభుత్వ కాలేజీలోకి మారినట్లు తెలిపారు. అంకమ్మ, ఎర్రయ్య దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు కాగా.. గౌతమ్ పెద్ద వాడు.

అక్షరాస్యత పెంపొందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఇతర అధికారులు

- ఉల్లాస్ అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సబర్బన్: నిరక్షరాస్యులైన వయోజనులకు అక్షరాస్యతను పెంపొందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమంపై ఎంపీడీఓలు, ఎంఈఓలు, డీఆర్‌డీఏ-ఏపీఎంలు, డీడబ్ల్యూఎంఏ- ఏపీఓలు, నగరపాలక, మున్సిపల్ కమిషనర్లు, సిటీ మిషన్ మేనేజర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, దీనికి సంబంధిత జిల్లా అధికాలందరూ తమ సహకారం, తోడ్పాటు అందించాలని కోరారు. 15-59 ఏళ్ల మధ్య నిరక్షరాస్యులైన వయోజనులకు ఉద్దేశించిన సాంకేతికత, వయోజన విద్య అందుబాటులోకి తెచ్చే కార్యక్రమమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో స్వచ్ఛంద బోధకులుగా కనీసం పదో తరగతి విద్యార్హత ఉన్న వారు ఎవరైనా సరే 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరిపే కార్యక్రమమని తెలిపారు. ఉల్లాస్-అక్షర ఆంధ్ర అక్షరాస్యతా కార్యక్రమం గ్రామ స్థాయిలో విజయవంతం అయ్యేలా తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమానికి వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు బి.జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారులు, గణాంక అధికారి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డీపీఓ వెంకట నాయుడు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాదుతో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై నిఘా

ఒంగోలు సబర్బన్: జిల్లాకు కేటాయించిన యూరియాను వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యూరియా వినియోగంపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియోగంపై డీఎస్ఓ, ఇండస్ట్రీస్, లేబర్, ఎక్సైజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డీటీసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్, అగ్రికల్చర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారన్నారు. యూరియా వ్యవసాయానికి కాకుండా వేరేదానికి ఉపయోగించారా అనేది కనిపెట్టాలని, తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదిక అందించాలన్నారు. సరిహద్దు రాష్ట్రాలకు సబ్సిడీ యూరియాను, ఎరువులను అనధికారిక తరలింపును నిరోధించేందుకు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఏప్రిల్ నుంచి ఆగస్టు నెల వరకు 54,468 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 34,051 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు వివరించారు.

15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకు...

ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి రేటే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రవికుమార్, మత్స్య శాఖ జేడీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విధ్వంసకులు చరిత్రహీనులే

● ప్రజా రచయిత జయరాజ్


మాట్లాడుతున్న ప్రజా రచయిత జయరాజ్

ఒంగోలు టౌన్: ప్రకృతిని కాపాడిన వారే ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారని, ప్రకృతిని విధ్వంసం చేసిన వాళ్లు చరిత్ర హీనులుగా మిగులుతారని ప్రజా రచయిత జయరాజ్ అన్నారు. నగరంలోని పీవీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న పుస్తక మహోత్సవం బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కళారంగం సమాజంపై ప్రభావం అనే అంశంపై జరిగిన చర్చలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి మానవుడికి సమస్తం ఇచ్చిందని చెప్పారు. విమానాలు, రాకెట్లను ప్రకృతి నుంచే స్ఫూర్తి పొంది తయారు చేశారని, మానవుడు సొంతంగా కనుగొన్నదేమీ లేదన్నారు. మనిషి అవసరాలను తీరుస్తుంది ప్రకృతేనని స్పష్టం చేశారు. ప్రకృతిని గాఢంగా ప్రేమించిన అంబేడ్కర్ దేశం గర్వించదగిన మేధావిగా పేరొందారన్నారు. ప్రకృతి సంపద సమస్త మానవులందరికీ సమానంగా చెందాలన్న కారల్ మార్క్స్ యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేశారని, చెరువులు తవ్వించి, చెట్లు నాటిన అశోకుడు చరిత్రలో గొప్ప రాజుగా నిలిచిపోయాడని వివరించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...ప్రపంచ విప్లవాలలో ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసింది ప్రజా కళలేనని చెప్పారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, చంద్రనాయక్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్ నాయుడు, గాయకులు రామకృష్ణ, నూకతోటి శరత్‌బాబు పాల్గొన్నారు. తొలుత జయరాజ్ రచించిన గేయాలను ఆలపించడం ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. పుస్తక మహోత్సవానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ఒంగోలు టౌన్: నగరంలోని గుంటూరు రోడ్డులో ఉన్న లాడ్జిలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. ముండ్లమూరు మండలం పసుపుగల్లు గ్రామానికి చెంది కీర్తి ఆంజనేయులు (25) సోమవారం ఉదయం లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మరుసటి రోజు మంగళవారం ఎంతకూ తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు తలుపులు తీసి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా హైదరాబాద్‌లో చిన్న ఉద్యోగం చేసి ఇటీవలే ఇంటికి వచ్చినట్లు తెలిసింది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ఆమోదించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


బ్యాంకర్లతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను త్వరగా ఆమోదించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బ్యాంకర్లకు సూచించారు. పొదుపు సంఘాల మహిళలకు రుణాల మంజూరుపై స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితిని డీఆర్‌డీఏ పీడీ నారాయణ కలెక్టర్‌కు వివరించారు. పొదుపు సంఘాల మహిళలు రుణాలను తిరిగి చెల్లించడంలో చురుగ్గా ఉన్నారన్నారు. గతంలో రుణాలు మంజూరు చేసేందుకు గ్రూపులోని సభ్యులంతా సంతకాలు చేసిన పత్రాలు బ్యాంకులకు సమర్పించేవారని, ఇప్పుడు బయోమెట్రిక్ వేలిముద్ర వేయటం ద్వారా గ్రూపు సభ్యులు తమ అంగీకారం తెలుపుతున్నారని వివరించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ విధానం ద్వారా మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను బ్యాంకులు ఆమోదించడంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియలో ఏమైనా మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్‌ను వచ్చే నెలలో ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మైక్రో క్రెడిట్ ప్లాన్స్‌ను బ్యాంకర్లు ఆమోదిస్తే ఎంత మొత్తంలో పొదుపు సంఘాలకు రుణాలు అవసరమో ఒక అవగాహన వస్తుందని పీడీ నారాయణ చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ త్వరగా ఈ తాత్కాలిక డిజిటల్ అప్రూవల్స్‌ను ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. అందుకోసం బ్యాంకర్లు పొదుపు మహిళా గ్రూపులకు ఉదారంగా రుణాలు అందించాలన్నారు. ఈ విషయాల్లో బ్రాంచ్ మేనేజర్లకు అవగాహన కల్పించేలా గురు, శుక్రవారాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. బ్యాంకర్లకు ఏపీఎంలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని పీడీని ఆదేశించారు. డ్వాక్రా సంఘాల మహిళలు చేస్తున్న పొదుపు డబ్బుల్లో 75 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని, మిగిలిన 25 శాతం నగదు అంతర్గత రుణాలకు ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ఎల్‌డీఎం రమేష్, బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక డిపోలను విస్తృతంగా తనిఖీలు చేయాలి

జిల్లాలోని ఇసుక డిపోలను విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని గనులు, భూగర్భ శాఖ అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గనులు, భూగర్భ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక డిపో యజమానులపై ఇసుక రవాణా చేసే వాహనదారులు, ట్రాన్స్‌పోర్టర్లు ఫిర్యాదులు చేస్తున్నారని ప్రస్తావించారు. రవాణాదారులను ఇసుక డిపో యజమానులు ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని సమగ్రంగా విచారించాలని ఆదేశించారు. ఖనిజ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు టి. రాజశేఖర్, ఏం. విష్ణువర్ధన్, బి. రామచంద్ర, ఇతర గనులు, భూగర్భశాఖ అధికారులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో టీడీపీ నేతల కక్ష సాధింపు


బేస్‌మెంట్‌ను తొలగిస్తున్న జేసీబీ


ఇంటి శిథిలాల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న మారం వెంకారెడ్డి దంపతులు

- నిరుపేద కుటుంబంపైకి అధికారులను ఉసిగొల్పి రాక్షసానందం
- జేసీబీతో ఇంటి పునాదులు పెకలించిన వైనం
- మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్

చీమకుర్తి: నిరుపేద కుటుంబంపై అధికారులు జులుం ప్రదర్శించారు. చీమకుర్తి శివారులోని గరికమిట్టలో నిరుపేదలైన మారం వెంకారెడ్డి, బాయమ్మ నిర్మించుకుంటున్న ఇంటి పునాదులను మంగళవారం పోలీస్ బందోబస్తు నడుమ మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. అధికార టీడీపీ నాయకుల ప్రోద్బలంతో మున్సిపల్ అధికారులు నిర్దాక్షిణ్యంగా ఇంటి పునాదులను జేసీబీతో పెకలించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిర్మించుకుంటున్న ఇంటి పరిసరాల్లో గత 12 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నామని, 6 నెలల క్రితం ఇంటిని నిర్మించుకునేందుకు పునాదులు వేసుకున్నామని బాధితులు తెలిపారు. కాగా మున్సిపల్ అధికారుల తీరుపై స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి మండిపడ్డారు. చీమకుర్తిలో వాగు పోరంబోకు స్థలాల్లో వందలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారని, వాటి జోలికి వెళ్లకుండా గరికమిట్టలో నిరుపేద కుటుంబం చిన్న ఇల్లు కట్టుకుంటుంటే కూల్చేయడం ఏమిటని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. అధికారం చేతిలో ఉందని కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రజలే గుణపాఠం చెబుతారని టీడీపీ నేతలను హెచ్చరించారు.

ప్రాణాల మీదకు తెచ్చిన ట్రిపుల్ రైడింగ్

- అతివేగంగా కారును ఢీకొట్టిన బైక్
- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న బైక్

దర్శి: మితిమీరిన వేగం ఆపై ట్రిపుల్ రైడింగ్ ముగ్గురు యువకులను చావు అంచుల వరకు తీసుకెళ్లింది. దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో ఎస్‌ఎస్సీ కాలనీ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి వైపు నుంచి దర్శికి వస్తున్న కారు ఆగి ఉన్న ఆటోను క్రాస్ చేసి ముందుకు వెళ్తోంది. అదే సమయంలో బృందావనానికి చెందిన కాటూరి శ్రీమాన్, కుంటా వంశీ, తోటకూర రుషి అనే ముగ్గురు యువకులు బైక్‌పై వేగంగా వస్తూ కారును ఢీకొట్టారు. కారు రేడియేటర్‌లోకి బైక్ చొచ్చుకెళ్లడంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదం ధాటికి బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు ఎగిరి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో శ్రీమాన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరు యువకులు దర్శిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

నీట్ పీజీలో మర్రిపూడి విద్యార్థిని ప్రతిభ


ఇనుకొల్లు దీప్తిరెడ్డి

మర్రిపూడి: నీట్ పీజీ పరీక్షా ఫలితాల్లో మర్రిపూడికి చెందిన ఇనుకొల్లు దీప్తిరెడ్డి 3,100 ర్యాంకు సాధించింది. దీప్తిరెడ్డి నీట్ యూజీలో రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంక్ సాధించి గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. రేడియాలజీ కోర్స్ పూర్తి చేసి పేదలకు సేవచేయడమే తమ లక్ష్యమని దీప్తిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దీప్తిరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ప్రమాద ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై


మృతుడు ముద్దా మహేష్

కనిగిరిరూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని చిన ఇర్లపాడుకు చెందిన ముద్దా మహేష్ (18) డీజే ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం సీఎస్‌పురం మండలంలోని కార్యక్రమానికి వెళ్లి రాత్రికి తిరిగి డీజే వాహనంలో వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని ఎన్ గొల్లపల్లి రోడ్డు మలుపు వద్ద జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

పంట పొలాల్లో చిరుత సంచారం!

కంభం: మండలంలోని నడింపల్లి, ఎల్‌కోట మధ్యలో ఉన్న పంట పొలాల్లో మంగళవారం చిరుత పులి పాద ముద్రలు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఔరంగబాద్ గ్రామానికి చెందిన రైతులు స్థానిక ఏనుగుకొండ సమీపంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట వద్దకు వెళ్లిన సమయంలో వారికి పులి పాదముద్రలు కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. రాత్రి ఫారెస్టు సిబ్బంది నడింపల్లి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. పరిసరాలను పరిశీలించిన ఫారెస్టు సిబ్బంది ఆందోళన చెందాల్సిన అవసరం అవసరం లేదని, జాగ్రత్తగా ఉండాలని రైతులకు, గ్రామస్తులకు సూచించారు. సుమారు మూడు గ్రామాలకు సమీపంలో ఉన్న పంట పొలాల్లో పులి పాదముద్రలు కనిపించడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.


పంట పొలాల్లో కనిపించిన పులి పాదముద్ర

నేటి నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

ఒంగోలు: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల ప్రకారం వివిధ న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న స్టెనోగ్రాఫర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, ఫీల్డు అసిస్టెంట్లు, ఎగ్జామినర్లు, కాపీయిస్టులు, డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్లు, ప్రాసెస్ సర్వర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టుల భర్తీకి బుధవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులో నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సొసైటీ యాక్షన్ ఇండియా(మామిడిపాలెం), బ్రిలియంట్ కంప్యూటర్స్(భాగ్యనగర్- కేబీ రెస్టారెంట్ ఎదురుగా), రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్(వల్లూరు), కృష్ణ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(మార్కాపురం), డాక్టర్ శామ్యూల్ జార్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్(మార్కాపురం) కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఈ నెల 24వ తేదీ వరకు పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో రోజూ 3 షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 6948 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి నిర్దేశిత సమయానికి 15 నిమిషాల ముందు వరకే అనుమతిస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ వెంట హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, కాపీయిస్టులు, డ్రైవర్లు, టైపిస్టులు పరీక్షలో ఉత్తీర్ణులైతే స్కిల్ టెస్టుకు పిలుస్తారని, ఏ ఒక్క విభాగానికీ ఇంటర్వ్యూ ఉండదని వెల్లడించారు. ఉద్యోగుల ఎంపిక మెరిట్ ఆధారంగా సాగుతుందని, దళారుల ప్రలోభాలకు లోనై మోసపోవద్దని హితవు పలికారు. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడంలో సాంకేతికపరమైన లోపాలు ఉంటే సహాయం కోసం 0863 2372752ను సంప్రదించాలని సూచించారు.

సైనిక కుటుంబాలకు న్యాయ సహాయం

ఒంగోలు టౌన్: రిటైర్డ్ సైనికులు, విధి నిర్వహణలో ఉన్న జవాన్ల కుటుంబాలకు ఎదురయ్యే న్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. ఒంగోలులోని సైనిక సంక్షేమ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఆమె మాట్లాడారు. అర్హులైనవారు ఉచిత న్యాయసహాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం తెలిపారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యులుగా న్యాయవాది ధనలక్ష్మి, న్యాయ సేవా సహాయకుడు పి.శ్రీనివాసరావు కొనసాగుతారని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి పద్మావతి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.రవి శంకర్, సీనియర్ న్యాయవాదులు సరళ, లక్ష్మి కుమారి, శ్రీనివాసరావు, సుబ్బారావు, వీర రాఘవులు, ఈశ్వరరావు, గ్రేస్ కుమారి, న్యాయసేవా సహాయకులు ఆంజనేయులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.